క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ నాగ వెంకట పవన్‌కుమార్

యలమంచిలి: వేసవి ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజలు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి పరిణమామని ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ గ్రంథి నాగ వెంకట పవన్‌కుమార్ ప్రారంభించారు. ప్రజలకు వడదెబ్బ తగలకుండా ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత, డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్, ఆర్‌ఐ కవురు యశోద, వీఆర్వో గోటేటి లక్ష్మీ నరసింహారావు (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం జిల్లా జడ్జి బదిలీ



పి.విజయదుర్గ

నరసాపురం: స్థానిక 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ విశాఖపట్టణం సీబీఐ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పిఠాపురం 7వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు నుంచి సోమవారం ఉత్తర్వులందాయి. విజయదుర్గ నరసాపురంలో గత నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. రికార్డు స్థాయిలో పెండింగ్ కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్ నిర్వహణలో మంచి గుర్తింపు పొందారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో గత సార్వా పంట నష్టం వెంటనే రైతులకు చెల్లించాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. కౌలు రైతుల సంఘం తరపున కలెక్టర్ నాగరాణికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోఅధిక వర్షాలకు జిల్లాలో 17 మండలాల్లో 135 గ్రామాల్లో 10,900 ఎకరాలు పైబడి పంటలు ముంపునకు గురై దెబ్బతిన్నాయన్నారు. ఈ దశలో వ్యవసాయ అధికారులు జిల్లాలో 8729 మందికి 9.54 కోట్ల పంట నష్టం అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 2019 కౌలు చట్టాన్ని రద్దు చేసి, ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం 2024 తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం విధి విధానాలు తయారు చేసి రాష్ట్రంలోని ప్రాంతీయ సదస్సులు పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసిందని కానీ ఇంత వరకు అధికారికంగా పాత చట్టాన్ని రద్దు చేయలేదని కొత్త చట్టం ఆమోదించలేదన్నారు. కౌలు రైతులకు భూయజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వకుండా పెట్టుబడి సాయం వేస్తే వాస్తవంగా పంటలు పండించే కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

పీజీఆర్ఎస్‌కు 8 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు సోమవారం 8 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని చెప్పారు. అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించడం వలన నగర పంచాయతీకి ఆదాయం పడిపోతుందని, ఇటీవల కాలంలో నగర పంచాయతీలో అనుమతులు లేకుండా స్థానిక సంతపేట వద్ద, అయిభీమవరం రోడ్డుల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని నిలుపుదల చేసి, పంచాయతీ ఆదాయం వృద్ధి చేయాలని ఫిర్యాదులు అందాయన్నారు. ఆస్తి తగాదా, తాళ్లకోడులో ఎన్ని పట్టాలు ఇచ్చారు. ఇటీవల సర్వేలో ఎన్ని పట్టాల్లో కాపురం ఉంటున్నారనే సమాచారం ఇవ్వాలని, నగర పంచాయతీలో తినుబండారాలు, కాఫీ హోటళ్లు, ఇతరత్రా తినుబండారాలు, నిత్యవసర వస్తువుల విక్రయాలపై ఎన్ని తనిఖీ చేశారు. ఎంతమందిపై కేసు నమోదు చేశారనే సమాచారం కోసం ఫిర్యాదు అందిందన్నారు. వీటితో పాటు పలు సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వైభవంగా రాములోరి రథోత్సవం



రాములోరిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

ఆకివీడు: శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక ఎస్‌టర్నింగ్ వద్ద వేంచేసియున్న రాములోరి ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను సోమవారం రథంలో ఊరేగించారు. తొలుత స్వామి వారికి మహాకుంభ నైవేద్యం సమర్పించారు. అనంతరం పూలతో అలంకరించిన రథంలో సీతారాములోరు, లక్ష్మణ, ఆంజనేయులను ఊరేగించారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు రథం లాగుతూ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి



చించినాడ వద్ద నిర్మానుష్యంగా ఉన్న 216 జాతీయ రహదారి

యలమంచిలి : ఏప్రిల్ నెలలోనే వేసవి ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఉదయం 10 దాటితే ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయడుతున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతుండటతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సూర్య ప్రతాపానికి ఉదయం 11 దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యమవుతున్నాయి. సాయంత్రం ఐదు దాటిన తరువాత వాతావరణం కొంత చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. అక్కడక్కడా చెదురు మదురుగా వర్షాలు పడుతున్నా పగటి ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ కర్ఫ్యూని తలపిస్తున్నాయి. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇళ్లలో నుంచి బయటకొస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే చించినాడ జాతీయ రహదారిపై కూడా అడపాదడపా మాత్రమే వాహనాలు తిరుగుతున్నాయి.

వ్యాపారాలు అంతంతమాత్రమే

ఎండల తీవ్రత నేపథ్యంలో వ్యాపారాలు సరిగ్గా జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఎండాకాలంలో కూల్‌డ్రింక్స్ షాపులు, జ్యూస్ సెంటర్లకు మంచి గిరాకీ ఉంటుంది. ఎండల తీవ్రతకు మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రాకపోవడంతో బేరాలు ఉండడం లేదని మేడపాడుకు చెందిన కూల్‌డ్రింక్ షాప్ యజమాని ముద్దల సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారి పక్కన పళ్ల రసాలు అమ్మే చిరు వ్యాపారులు సైతం ఎండల కారణంగా బేరాలు లేవని చెబుతున్నారు.

వడగాలులతో జాగ్రత్త



అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో బయట తిరగకపోవడమే మంచిది. తప్పనిసరైతే హెల్మెట్, టోపీ, గొడుగు ధరించి వెళ్లాలి. బయటకు వెళ్లేవారు చమట, వేడి వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా మంచినీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ, సబ్జా నీరు బాటిళ్లలో తీసుకెళ్లి ఆరగారగా తాగాలి. ఓఆర్ఎస్ కూడా మంచిదే. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ఇంటికే పరిమితమవ్వడం ఉత్తమం. – ఆర్ శ్రీసాహిత్య, డాక్టర్

స్టాక్ పాయింట్ తనిఖీ



వడలిలో స్టాకపాయింట్‌ను తనిఖీ చేస్తున్న విద్యా శాఖాధికారులు

పెనుగొండ: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ పెనుగొండ మండల స్టాక్ పాయింట్‌ను వడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏర్పాటుచేశారు. దీనిని జిల్లా ఇన్‌చార్జి టీఎండీ ఇస్మాయిల్, సీఎంఓ వై.చంద్రశేఖర్‌లు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. మండల టీం సభ్యులు ఎంఈఓలు, సీఆర్‌పీలు, పీటీఐలు, ఐఈఆర్‌టీలకు పలు సూచనలు చేశారు. స్టాకు వచ్చిన వెంటనే రిసీవ్ చేసుకొని యాప్‌లో అప్‌లోడ్ తప్పనిసరిగా చేయాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు రూట్ మ్యాప్ సిద్ధ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు డి.శుభాకరరావు, పి.రామకృష్ణలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



లంకల కోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆరోగ్య దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయి సూచించారు. సోమవారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలను తగ్గించడానికి కృషి చేయాలన్నారు. ఆరోగ్య కార్యక్రమాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవాలని అన్నారు. రెవెన్యూ అధికారి దాశి రాజు మాట్లాడుతూ మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకుని సేవా భావంతో వైద్య సేవలందించాలని సూచించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, వైద్యులు అడ్డాల ప్రతాప్ కుమార్, న్వయ జీవన్, భావన, క్రాంతి, గుడాల హరిబాబు, రోటరీ సభ్యులు ముత్యాల శ్రీనివాసరావు, రావాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం

ప్రతి మనిషీ అనారోగ్యాలకు గురికాకుండా మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ అన్నారు. సోమవారం పాలకొల్లులోని అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి డిగ్రీ కళాశాలలో వరల్డ్ హెల్త్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ 1948లో ప్రపంచ ఆరోగ్య సంస్థను స్థాపించిన రోజును వరల్డ్ హెల్త్ డేగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చిరు తిండ్లకు దూరంగా ఉండాలన్నారు. మంచి ప్రోటీన్స్ ఉన్న ఆహారం మాత్రమే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, హెల్త్ కేర్ కన్వీనర్ పి.జ్యోత్స్న, డి.హెప్సిరాణి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం, బెల్ట్ షాపులను అరికట్టాలి



ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం ఇస్తున్న కల్లుగీత కార్మికసంఘం నాయకులు

నరసాపురం: అక్రమ మద్యం, బెల్ట్ షాపులను అరికట్టాలని ఏపీ కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో నర్సింహమూర్తి మాట్లాడారు. జిల్లాలో ఐదు వేలకు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయని అన్నారు. పట్టణాలు, గ్రామాలు అనే తేడాలేకుండా బెల్ట్‌షాపు ఏర్పాటు చేవారని వివరించారు. యానాం తదితర ప్రాంతాల నుంచి అక్రమ మద్యం యథేచ్ఛగా వస్తోందని అన్నారు. గీత వృత్తి పూర్తిగా నాశనమైందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం నరసాపురం డివిజన్ అధ్యక్షుడు బొక్కా చంటి మాట్లాడుతూ మద్యం పాలసీ పూర్తిగా మారుస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏరులై పారిస్తోందని విమర్శించారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ మేరకు నరసాపురం ఎక్సైజ్ సీఐ రాంబాబుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పెచ్చెట్టి నర్సింహరావు, గుబ్బల వెంకన్న, బొక్కా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఆర్డీఓ దాసి రాజులు రైతులకు సూచించారు. నరసాపురం మండలం సీతారామపురం నార్త్ గ్రామ రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మైలాబత్తుల సోని, సర్పంచ్ పులపర్తి భ్రమరాంబ, తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ ఈదా అనిల్ కుమారి, ఏఓ జాన్సన్, రైతులు పాల్గొన్నారు.

ఆర్యపేటలో..

యలమంచిలి: స్థానిక ఆర్యపేట రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిల్‌కుమారి మాట్లాడుతూ 75 కిలోల బస్తా కామన్ వెరైటీ రకానికి రూ.1725, గ్రేడ్ ఎ వెరైటీ రకానికి రూ.1740 చెల్లిస్తామని చెప్పారు. ఎఫ్‌టీఓ జనరేట్ అయిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు ఆరిమిల్లి రామశ్రీనివాస్, తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్, ఏఓ చిందులూరి దేవి, సొసైటీ ప్రాంతీయ అధికారులు ఎస్ శ్రీనివాసరావు, జోసెఫ్ పాల్, వ్యవసాయ సహాయకులు స్వప్న, ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు, కాలనీల వాసులు

పెనుగొండ: కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. సోమవారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమయంలో ధర్నా చేశారు. తహసీల్దారు జి.అనితకుమారి, ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తిలకు వినతి పత్రం అందజేశారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్ లైన్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్లు లేక గ్యాస్ సిలిండర్లు, రేషన్ వాహనాలు సైతం కాలనీలకు రావడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, కె.లోవరాజు, వి.మమత, సునీత, జి.వెంకటేష్, కాసా రామలింగం, పడాల సాయికుమారిలు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరుని కల్యాణం



విద్యుత్ దీపకాంతుల్లో వేంకటేశ్వర ఆలయం

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామంలో దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, లక్ష్మీ వరాహ నరసింహస్వామి, ఏకాంబరేశ్వర స్వామి సమేత కామాక్షి దేవి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాలు సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసులు రామకృష్ణ చార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించగా, ఆలయాలలోనే ఉన్న లక్ష్మీ వరాహ నరసింహ స్వామి కల్యాణాన్ని వేద పండితులు శ్రీనివాస్ వెంకటేశ్వర ఆచార్యులు ఆధ్వర్యంలో, ఏకాంబరేశ్వర సమేత కామాక్షి దేవి కల్యాణోత్సవాన్ని కొండవీటి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కల్యాణ ఉత్సవాలను తిలకించారు.



వేంకటేశ్వరుని కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు.



రంగురంగుల జాయింట్ వీల్స్

విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందుకున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: వసుధ పౌండేషన్ నిర్వహిస్తోన్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కాస్మో క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు అన్నారు. సోమవారం కాస్మో క్లబ్‌లో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.10 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మంతెన వెంకట రామరాజు స్ఫూర్తితో తాము కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని గాంధీ భగవాన్‌రాజు తెలిపారు. 13 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు, ఒక మెడిసిన్ విద్యార్థికి విద్య నిమిత్తం, ఒక క్యాన్సర్ పేషెంట్, ఒక కిడ్నీ పేషెంట్‌లకు ఆర్థిక సాయం అందించినట్టు ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేకూరి సూరిబాబురాజు, డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ, చేరుకూరి వెంకటేశ్వర వర్మ, రామలింగరాజు, బద్రినారాయణ రాజు, వెంకటపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

'నీకు 15 వేలు.. నీకు 15 వేలు' హామీ మరిచారా?



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత జయ సరిత

పాలకొల్లు సెంట్రల్: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రా జయసరిత విమర్శించారు. సోమవారం వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలని చెప్పి సూపర్ స్టోక్ ఇచ్చారని ఆరోపించారు. నాడు జగనన్న అమ్మఒడి పేరుతో రూ.15 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేశారని గుర్తుచేశారు. అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా కాపీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. స్థానిక మంత్రి నిమ్మల రామానాయుడు 'నీకు 15, నీకు 15'అంటూ ఎంతో ప్రచారం చేసుకుని ఓట్లు వేయించుకున్న ఆతృత, ఆ పథకాన్ని అమలు చేయడంలో కనిపించడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మామిడిశెట్టి చిట్టిబాబు, జోగాడ ఉమామహేశ్వరరావు జోగి వెంకటేశ్వరరావు, రామాంజుల చిన్నమధు, వీరా మల్లికార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

కేసును ఛేదించిన అధికారులకు అభినందన

భీమవరం: గుడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్‌ను బలోపేతం చేసి బాధితులకు, ఫిర్యాదుదారులకు ఖచ్చితమైన న్యాయం అందించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తున్నట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. పాలకొల్లులో ఒంటరి మహిళపై దాడి చేసి అత్యాచారం, హత్య, బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో ముద్దాయిలకు తీర్పు వెలువడిన సందర్భంగా కేసును ఛేదించిన పోలీసు అధికారులు, ఏపీపీని సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో అభినందించారు. మొత్తం కేసును 8 నెలల 9 రోజుల్లో విచారణ పూర్తి చేసినందున దర్యాప్తు అధికారులు పాలకొల్లు సీఐ కె.మంగాదేవి, ఎస్సై కె.రజనీకుమార్, కోర్టు కానిస్టేబుల్ ఎస్.మురళి, లైజనింగ్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఏఎస్పీ వి.భీమారావు, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద, ఏపీపీ డీవీ రామాంజనేయులు, తదితరులను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

కోరిమిల్లిలో ప్రారంభమైన సువార్త పండుగలు

పెంటపాడు: దేవుని ప్రేమకు విధేయులై, ఆయన చిత్తాను సారంగా క్రైస్తవులు జీవనం సాగించాలని రాజమండ్రికి చెందిన దైవసేవకులు షేక్ మక్బూల్ పేర్కొన్నారు. దైవసేవకులు మల్లిపూడి ఒనేసిం, అరుణ ఒనేసిమ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కోరిమిల్లిలో ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఏసయ్య సువార్త పండుగలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ మక్బూల్ మాట్లాడుతూ నిన్నువలే పొరుగు వానిని ప్రేమించాలనే ఆజ్ఞకు ప్రతి ఒక్కరూ విధేయులు కావాలనఅనరు. ఈ కార్యక్రమంలో జి. డేనియల్ జిత్రో(వైజాగ్), (రాజమండ్రి), జి. ఐజయ్య (బిట్రగుంట) ఈ సభలకు హాజరువుతారని నిర్వాహకులు ఒనేసిం తెలిపారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని చెప్పారు. 21 నుంచి 25 సంవత్సరాల వయసు గల యువకులు తమ బయోడేటా సర్టిఫికెట్స్‌తో హాజరవ్వాలని అన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ లేదా బీ టెక్ ఇన్‌స్టుమెంటేషన్ వంటి అర్హతలున్న వారు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మదన గోపాలస్వామి ఉత్సవాలు

పెనుగొండ: ఆచంటలో రుక్మిణ సత్యభామ సమేత మదన గోపాలస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామి వారికి సమస్రనామార్చనలు, రుక్మిణీ సత్యభామ అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ ఏర్పాట్లు చేశారు.

అశ్లీల నృత్యాలపై దాడి

యలమంచిలి: మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి దాడి చేసినట్టు ఎస్సై కర్రీడి గుర్రయ్య తెలిపారు. ఈ దాడిలో ఇద్దరు ట్రాన్స్ జెండర్లు, ఐదుగురు వ్యక్తులను పట్టుకుని, కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

యువకుడు అదృశ్యం

యలమంచిలి: మొగల్తూరు మండలం కొత్తకాయలతిప్ప గ్రామానికి చెందిన లక్కు శేఖర్ (21) ఆదివారం మధ్యాహ్నం నుంచి కనపడంలేదని అతని తండ్రి వీరాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని ఎస్సై కర్రీడి గుర్రయ్య తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన శేఖర్ చించినాడ వంతెనపై నుంచి గోదావరిలోనికి దూకుతున్నట్లు ఫోన్ చేశాడని పేర్కొన్నారు. గోదావరిలో గాలిస్తున్నట్లు ఎస్సై వివరించారు.